బాబూ.. భృతి హామీ గుర్తుందా!

- అమలుకు పడని ముందడుగు
- ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు



యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కూటమి నాయకులు ప్రకటించిన మేనిఫెస్టో

2014 ఎన్నికల సమయంలో టీడీపీ–జనసేన–బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఆ సమయంలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఊదరగొట్టారు. లేకపోతే డిగ్రీ , తత్సమానమైన చదువు పూర్తి చేసిన వారికి నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. యువత ఓట్లు దక్కించుకుని అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగున్నరేళ్లు గడిచిన తర్వాత అర్హత ఉన్నవారిలో కనీసం 20 శాతం మందికి కూడా భృతి ఇవ్వకుండా దగా చేశారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి టీడీపీ–జనసేన–బీజేపీ జతకట్టాయి. మళ్లీ నిరుద్యోగ భృతి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. లేకపోతే నెలకు రూ. 3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మిన నిరుద్యోగులు మరోసారి కూటమికి ఓట్లు వేశారు. కానీ అధికారం చేపట్టి నెల రోజులు దాటినా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భృతిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

గోపాలపట్నం/మల్కాపురం: ఎన్నికల సమయంలో యువత, నిరుద్యోగుల ఓట్ల కోసం హామీలు గుప్పించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఊదర గొట్టారు. ఉద్యోగం కల్పించకపోతే ఒక్కొక్కరికీ నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అది నమ్మి యువత ఓట్లు వేశారు.

అధికారం చేపట్టి 40 రోజులు కావస్తున్నా.. ఇచ్చిన హామీలు ఊసెత్తక పోవడంతో 2014 సీన్ రిపీట్ కాదు కదా అని నిరుద్యోగ యువత ఆలోచనలో పడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 85వేల కుటుంబాలు ఉంటాయి. అందులో నిరుద్యోగులు సుమారు 8వేల మంది ఉంటారు. చదువులు పూర్తయి మంచి ఉద్యోగం వస్తే కుటుంబానికి ఆసరాగా నిలుస్తామని ఆశగా ఎదురు చూస్తున్నారు. భృతి ఇస్తే ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునేందుకు తల్లిదండ్రులపై ఆధార పడకుండా ఉంటామని చెబుతున్నారు. గతంలో మాదిరి అధికారం సగం అనుభవించి తీరిగ్గా లేనిపోని నిబంధనలు పెట్టి భృతి ఎగ్గొట్టవద్దని కోరుతున్నారు.

భృతి కోసం ఎదురు చూపులు



చంద్రబాబు తన ఎన్నికల ప్రచారంలో కూటమి గెలిస్తే నిరుద్యోగులకు రూ. 3 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ నమ్మి తాను గడిచిన ఎన్నికల్లో మద్దతు తెలిపాను. నిరుపేద కుటుంబానికి చెందిన నేను బీకాం పూర్తి చేశాను. ఉపాధి లభించలేదు. కూటమి ప్రభుత్వం భృతి ఇస్తే దానితో పోటీ పరీక్షలకు సంబంధించి అవసరమైన పుస్తకాలు కొనుక్కుంటాను.

– జి.చక్రి, బీకాం, ప్రకాష్‌నగర్

హామీలు నెరవేర్చాలి



ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. కాని ప్రస్తుత ప్రభుత్వం ఇంకా ఆ దిశగా ఆలోచించడం లేదు. ఇంటికో ఉద్యోగమన్నారు.ఎవరికీ ఇవ్వలేదు. నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పారు. ఇంత వరకూ కనీసం గైడ్‌లైన్స్ కూడా ప్రకటించలేదు. ఉద్యోగం వచ్చే వరకూ కనీసం భృతి ఇస్తే కుటుంబానికి భారం కాకుండా ఉంటాం.

– వినయ్, కరాసా

ఉద్యోగమా.. భృతా..



కూటమి నాయకుల మాట నమ్మి ఆ పార్టీకి ఓటు వేశాను. అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా సూపర్ సిక్స్‌లో మొదటి హామీపై ఎలాంటి ప్రకటన చేయలేదు. డిప్లమో పూర్తి చేసిన నాకు ఉపాధి దొరకలేదు. భృతి వస్తే దానితో నా కనీస అవసరాల కోసం ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం స్పందించి తక్షణమే నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయాలి. నిరుద్యోగులు కుటుంబానికి భారం కాకుండా చర్యలు చేపట్టాలి.

– కుమార్, డిప్లమో సివిల్, శ్రీహరిపురం

నిరుద్యోగులను మోసం చేయవద్దు



నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాను. కూటమి ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు కావస్తోంది. ఇప్పటికీ నిరుద్యోగ భృతికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఐదేళ్లు గడిపేసింది. ఉపాధి కల్పించలేదు. ఈ సారి అలా చేయరని నమ్మి మద్దతు తెలిపాం. ఇప్పటికైనా భృతిపై మార్గదర్శకాలు విడుదల చేసి మాలాంటి యువతకు ఒక దారి చూపాలి.

– కాళ్ల మురళి, కొత్తపాలెం

క్లుప్తంగా

నేడు కుంచుమాంబ పండగ



మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ గ్రామంలో వెలసిన కుంచుమాంబ అమ్మవారి పండగను మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచు అమ్మవారికి పసుపు,కుంకుమలతో పూజలు చేయడానికి ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వారు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు.

మర్యాద పూర్వక కలయిక



కలెక్టర్‌ను సత్కరిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను సోమవారం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధికి పాటు పడాలని కోరారు. కలెక్టర్‌ను శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

స్వచ్ఛంద సేవకులతో ఈవో సమీక్ష



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: గిరిప్రదక్షిణలో భక్తులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అమోఘమని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కొనియాడారు. ఈ నెల 20న సింహగిరి ప్రదక్షిణ, 21న సింహగిరిపై ఆలయ ప్రదక్షిణలను పురస్కరించుకుని భక్తులకు ఆహారపదార్థాలు, పానియాలు అందించే స్వచ్ఛంద సంస్థలతో సోమవారం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఈవో సమావేశం నిర్వహించారు. దాదాపు 50 వరకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సమావేశానికి హాజరయ్యారు. ఎవరెవరు ఏయే ప్రదేశాల్లో భక్తులకు ఆహారపదార్థాలు, పానియాలు అందిస్తారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీకి 01, ఇంజినీరింగ్ విభాగానికి 02 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, వాటర్ ఏఈ మోహన్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ సకాలంలో పూర్తి చేయండి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: ఎన్ఏడీ సమీపంలోని ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద గ్రీన్ బెల్ట్‌లో నిర్మిస్తున్న వనితా వాకింగ్ ట్రాక్ పనులు సకాలంలో పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. సోమవారం జీవీఎంసీ అధికారులతో కలసి గ్రీన్ బెల్ట్ ఏరియా, కల్యాణ వేదిక నిర్మాణ పనులు పరిశీలించారు. మర్రిపాలెం వుడా లే అవుట్ కాలనీ నుంచి గ్రీన్ బెల్ట్‌కు వచ్చే దారులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వనితా వాకింగ్ ట్రాక్ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నందున గ్రీనరీ పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యాన వన విభాగం అధికారులకు సూచించారు. పర్యటనలో ఈఏ ఉష, ఉద్యానవన ఏఈ పల్లవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆదర్శం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్



ప్రతిభ చూపిన విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం: స్వాతంత్ర్య సమరయోధురాలు,సంఘ సంస్కర్త అయిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌ను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఆమె చిత్రపటానికి భాగ్యలక్ష్మి తో పాటు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దుర్గాబాయ్ ఆంధ్ర మహిళా సభను స్థాపించడంతో పాటు భారత రాజ్యాంగ పరిషత్‌లో,ప్రణాళిక సంఘంలో సభ్యురాలిగా పని చేశారని వివరించారు. ఈ సందర్భంగా ఆమె జీవిత విశేషాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు



గోపాలపట్నంలో ద్విచక్రవాహన చోదకుడికి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో సోమవారం హెల్మెట్ ఆవశ్యకతపై సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహన చోదకులకు పుష్పగుచ్ఛాలు అందించి హెల్మెట్ వాడడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పారు. పుష్ప గుచ్ఛాల్లో పువ్వులవలే మీ కుటుంబాలు పరిమళించి సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నమని తెలిపారు. ఈ సంతోషాలు ఉండాలంటే వాహన చోదకులు హెల్మెట్లు వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయ్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

జోరు వాన



గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం



గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో చేరిన వర్షపునీరు

గోపాలపట్నం: ఎన్ఎస్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల్లో సోమవారం జోరు వర్షం కురిసింది. సుమారు గంట పాటు భారీ వర్షం పడడంతో రహదారులపై వర్షపు నీరు చేరింది. పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. శ్మశాన వాటిక జంక్షన్, పెట్రోల్ బంక్ వద్ద మురుగు నీరు నిలిచి పోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. వర్షం తగ్గినా చాలా సేపటి వరకు వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో వర్షపు నీటితో నిండిపోయింది. ప్రధాన కాల్వల్లో వ్యర్థాలు నిలిచి పోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి లోతట్టు ప్రాంతాల్లోకి చేరింది. వ్యర్థాలు అడ్డు ఉండడంతో వర్షం పడిన సమయాల్లో మురుగు నీరు రహదారులపైకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

మంత్రులకు ఘన స్వాగతం



కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: విశాఖ వచ్చిన బీజేపీకి చెందిన పలువురు మంత్రులకు ఆ పార్టీ నాయకులు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కూటమి విశాఖ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం నుంచి నగరంలోకి ర్యాలీగా బయలుదేరారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కాశీరాజు, సురేంద్ర కుమార్, బాల రాజేశ్వరరావు తదితర నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

19 నుంచి గురుపౌర్ణమి మహోత్సవాలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం, మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు గురుపౌర్ణమి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 19న విఘ్నేశ్వరుడి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం సకల దేవత మండప ఆహ్వానం, అగ్ని ప్రతిష్ఠ, సాయి మూలమంత్ర హోమం ఉంటాయన్నారు. 20వ తేదీన సాయినాథుడికి విభూది అభిషేకం చేస్తామన్నారు. 21న గురుపౌర్ణమి సందర్భంగా మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం సుమారు 5 వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయంత్రం సాయిబాబా పల్లకీ సేవ, హారతులు, తిరువీధి ఉత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు.

పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషి

- సీపీ శంఖబ్రత బాగ్చి
- కరాసా పోలీస్ క్వార్టర్స్ సందర్శన



కరాసా పోలీస్ క్వార్టర్స్‌లో పోలీసు కుటుంబాలతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, జాయింట్ సీపీ ఫకీరప్ప

గోపాలపట్నం: పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తానని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కరాసా పోలీస్ క్వార్టర్స్‌ను సోమవారం ఆయన జాయింట్ సీపీ ఫకీరప్పతో కలిసి సందర్శించారు. స్థానికంగా ఉన్న పోలీసు కుటుంబ సభ్యులు ఇక్కడి సమస్యలపై ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించేదకు ఆయన వచ్చారు. ఇక్కడి గృహ సముదాయాలను పరిశీలించారు. పోలీస్ కుటుంబాలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ సక్రమంగా లేక వర్షాకాలంలో నీరు నిల్వ ఉండిపోయి వల్ల దోమల బెడద ఉందని ఆయన ముందు వాపోయారు. చాలా ఇళ్లకు తలుపులు, కిటికీలు లేవని తెలిపారు.గచ్చులు మరమ్మతులకు గురయ్యాయని, వీధి దీపాలు లేవని వివరించారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పోలీస్ కుటంబాలకు ఏ సమస్య వచ్చినా 7995095799 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

హక్కుల సాధనకే 'మాల మహానాడు'



దళిత నేత ధర్మారావును సత్కరిస్తున్న దళిత నాయకులు

సింధియా: స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఒకే తల్లి బిడ్డల్లాంటి మాల, మాదిగల మధ్య చిచ్చు రేపుతున్న వారిని ప్రశ్నించి, హక్కులను సాధించేందుకే మాల మహానాడు ఏర్పడిందని సీనియర్ నేత, దళిత రత్న మాటూరి చిన్నారావు అన్నారు. త్వరలో జరగనున్న మాలమహానాడును జయప్రదం చేయాలని కోరారు. యువజన నాయకుడు తంతటి సంపత్ అధ్యక్షతన మల్కాపురంలో సోమవారం నిర్వహించిన మాలమహానాడు సమీకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల దళితులు ఇంకా వెనుకబడే ఉన్నారన్నారు. దళిత నేత కొత్తపల్లి వెంకటరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ దళితులలో విభేదాలు తేవడానికి చంద్రబాబు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గాజువాక ఆర్టీసీ డిపో దళిత నేత ధర్మారావును ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత మాలమహానాడు కార్యకర్తలు దేవగాంధీ, ఆటో శ్రీను, నడుపూరి రమణ, పెయ్యల సిద్ధార్థ, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి శ్రీలక్ష్మి

గాజువాక: విద్యార్థులు తాము చదువుకుంటున్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎనిమిదో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వై.శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక డిఫెన్స్ అకాడమీలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, అది భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రభాకరరావు, మాజీ కార్యదర్శి బీవీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

1,250వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

అగనంపూడి: కేంద్ర ఉక్కు మంత్రి స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించినా ప్లాంట్ పరిస్థితి చక్కబడలేదు సరికదా హీన స్థితికి చేరుకుంటుండడం బాధాకరమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1,250వ రోజు సోమవారం వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర మంత్రి ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లబోమని ప్రకటించినా, కేంద్ర ప్రభుత్వం వల్ల ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడిన విశాఖ ఉక్కును ఆదుకోడానికి ప్రభుత్వమే చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' సంక్షోభంపై సదస్సు రేపు

ఉక్కునగరం: 'సంక్షోభంలో విశాఖ ఉక్కు –పరిష్కారం ఎలా ' అనే అంశంపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహిస్తున్న సదస్సు పోస్టర్‌ను యూనియన్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై నిష్ణాతులతో కార్మికులలో అవగాహన, చైతన్యం కలిగించి వారితో సరైన పోరాటాలను నిర్మించడం ధ్యేయంగా ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ వై.శివసాగరరావు, సీఐటీయు జాతీయ ప్రధానకార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్. నర్సింగరావు సదస్సులో పాల్గొంటున్నారన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్య రామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ప్రసంగించారు.

ట్రిపుల్ ఐటీకి యశస్విని ఎంపిక



కనక యశస్విని

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ ఆదర్శ రాయల్ విద్యాలయ విద్యార్థిని వై.కనక యశస్విని ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళంలో సీటు సాధించింది. యశస్విని పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాజ్య పురస్కార్(గవర్నర్ అవార్డు) సర్టిఫికెట్ పొందింది. దీంతో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి వేణుగోపాల్, గైడ్ కెప్టెన్ డి.నాగశ్రీ అభినందించారు.